క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠినచర్యలు


సీఐ సుబ్రహ్మణ్యం

యల్లనూరు: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. శుక్రవారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గొడవలు సృష్టించినా, పాల్పడినా జైలుకు పంపుతానన్నారు. ఎక్కడైనా శాంతిభద్రతలు అదుపుతప్పితే.. ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ సంపత్‌కుమార్, పోలీసులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గుంతకల్లుటౌన్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌కేపీ ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 205 మంది విద్యార్థినులకు ఉచితంగా థైరాయిడ్ పరీక్షలను నిర్వహించారు. వ్యాపారవేత్త సత్రసాల జగదీష్ గుప్తా సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో ప్రముఖ స్త్రీ వైద్యనిపుణురాలు సరోజమ్మ థైరాయిడ్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం శిబిరదాత జగదీష్ గుప్తాను ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, రొటేరియన్లు సన్మానించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శివానంద, శ్రీనివాసులు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అర్చనకార్వా, సునీత, సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తుల పరిరక్షణలో ఆర్పీఎఫ్ సేవలు భేష్


కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీఆర్‌ఎం, అధికారులు

గుంతకల్లు: రైల్వే ఆస్తుల పరిరక్షణలో రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) సేవలు అమోఘమని డీఆర్‌ఎం విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రైల్వే రక్షణ దళం గుంతకల్లు డివిజన్ సెక్యూరిటీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఆర్‌ఎం తోపాటు ఏడీఆర్‌ఎం సుధాకర్, సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్పీఎఫ్‌లకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అందులో దాదాపు రూ.15 లక్షలు ఖర్చు చేసి సెక్యూరిటీ కార్యాలయాన్ని నిర్మించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మహిళా ఆర్పీఎఫ్ బ్యారెక్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని ఆర్పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె విరమణ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట 23వ రోజు వాటర్ సప్లై కార్మికులు శుక్రవారం సమ్మె విరమించారు. ప్రభుత్వం జీతాలు చెల్లిస్తామని అధికారుల ద్వారా సంకేతాలు తెలిపారని యూనియన్ నాయకులు రాఘవేంద్రాచారి తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు దేవదాస్, కిష్టప్ప, నాగరాజు పెద్దన్న, విశ్వరూప, విశ్వనాథ్ వలి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు తీసుకుంటున్న తహసీల్దార్ ఉషారాణి

పెద్దవడుగూరు: మండల తహసీల్దార్ గా ఉషారాణి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి భూ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గార్లదిన్నె మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారిణి అనుపమ జేమ్స్

గుత్తి: ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు వైద్యాధికారిణి అనుపమ జేమ్స్ సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది? ఎయిడ్స్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను వివరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్లారాముడు, ఐసీటీసీ సూపర్‌వైజర్ వెంకటేశులు, టీబీ సూపర్‌వైజర్ దేవదాస్, హ్యాండ్స్ మేనేజర్ రమేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మెడిసిన్ విద్యపై ఆశలు గల్లంతు

నా కుమారుడికి నీట్‌లో ర్యాంకు వచ్చింది. కుమార్తె ఇంటర్ చదువుతోంది. సోదరులు, సోదరీమణుల చేయూతతో పిల్లలను చదివిస్తున్నాను. జగన్ సర్కారు హయాంలో కొత్త మెడికల్ కాలేజీలు మంజూరవ్వడం నాలాంటి పేదవర్గాల కుటుంబాల్లో ఆశలు రేకెత్తించింది. ఈ తరుణంలో టీడీపీ సర్కారు కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే మాలాంటి పేద కుటుంబాల పిల్లలకు మెడిసిన్ విద్య అందని ద్రాక్ష అవుతుంది.

– వీ బుజ్జిబాబు, నీట్ విద్యార్థిని తండ్రి, పామిడి



వైద్య విద్యార్థులకు కష్టాలు



టీడీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయనుండడంతో వైద్య విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటై సీట్లు పెరిగి తే విద్యార్థులకు ప్రయోజనం. ప్రభుత్వమే మెడికల్ సీట్ల రద్దుకు ప్రయత్నించడం దారుణం. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేసి విద్యార్థులకు అన్యాయం చేయాలని చూస్తున్నారు.

– రవికుమార్, బైపీసీ, ద్వితీయ సంవత్సరం, యల్లనూరు

దర్జాగా చెరువు మట్టి తరలింపు

- బరితెగిస్తున్న పచ్చ మాఫియా
- చోద్యం చూస్తున్న అధికారులు


రాయలచెరువు గ్రామ సమీపంలోని చెరువు నుంచి టిప్పర్ ద్వారా మట్టి తరలిస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్ ఫోర్స్: అడిగేవారు లేరు. పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తాలేరు. ఇంకేముంది అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. యాడికి మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపంలో ఉన్న చెరువు మట్టిని కొందరు అక్రమంగా రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పట్టపగలే ఈ దోపిడీ వ్యవహారం మూడు టిప్పర్లు, ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది. మండలంలోని రాయలచెరువు గ్రామంలో కూటమిగా ఏర్పడిన ఓ పచ్చ బ్యాచ్ అధికారంలోకి రాగానే అక్రమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. వారం రోజులుగా గ్రామ సమీపంలో ఉన్న చెరువు మట్టిని జేసీబీతో టిప్పర్లకు నింపుకుని తరలిస్తూ కాసులు దండుకుంటున్నారు. ఎక్కడైనా ఇసుక, చెరువు మట్టిని తరలించాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలి. ఇక్కడ మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా చెరువులో తవ్వి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులో మట్టిని జేసీబీతో టిప్పర్లకు నింపి జేబులు నింపుకుంటున్నారు. ఇలా రోజుకు 100 టిప్పర్లకు చెరువు మట్టిని నింపడంతో రూ రూ.60 వేల వరకూ దండుకుంటున్నట్లు సమాచారం. వారం రోజులుగా గ్రామంలో ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా చెరువులో తవ్వుతూ మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కాలంలో టీడీపీ మాజీ ఎంఎల్‌ఏ , మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రకృతి సహజ వనరులను ఎవరైనా సరే అక్రమంగా రవాణా చేస్తే ఉపేక్షించబోనని మీడియా ముఖంగా హెచ్చరికలు జారీ చేశారు. ఆయన తనయుడు ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి కూడా కొద్ది రోజుల క్రితం అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయడంలో భాగంగా పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఏకంగా తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కానీ చెరువు మట్టిని తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై అన్నీ తెలిసి కూడా చర్యలు తీసుకోకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లు: పట్టణంలోని మార్కెట్ యార్డు, ఆలూరు రోడ్డు, ఇండస్ట్రీయల్ ఏరియా, ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంగస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుదని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పార్ట్‌టైమ్ పీఈటీ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: స్థానిక ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టును పార్ట్‌టైమ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నా యక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డిగ్రీతోపాటు బీపీఈడీ కోర్సు చేసిన అభ్యర్థులు పీఈటీ పోస్టుకు దరఖాస్తుచేసుకోవాలన్నారు. మరిన్న వివరాలకు 8712625062 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలి


నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది

తాడిపత్రిటౌన్: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ విధులను వెంటనే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించామని గుర్తు చేశారు. నెలల తరబడి జీతాలు రాకున్నా విధులు నిర్వహిస్తున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేయాలని వారు కోరారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు భూమిపూజ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 5,7 వార్డుల్లో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.27 లక్షల సాధారణ నిధులతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, టీడీపీ నాయకుడు నారాయణస్వామి శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లింగన్న, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఏఈ హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


ఆలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఆలూరు, వెలమకూరు, బోడాయిపల్లి గ్రామాల్లో జరిగిన గ్రామ సభలో శుక్రవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ముందుండాలని సూచించారు. పలు సమస్యలను ఎమ్మెల్యేకి ప్రజలు తెలియజేశారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభల్లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ఐక్యతను చాటుతున్న సంచారజాతుల సంఘం నాయకులు, ఎమ్మెల్యే జయరామ్

గుంతకల్లుటౌన్: సంచార జాతులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించే విషయమై రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే జయరామ్ అన్నారు. శుక్రవారం గుంతకల్లప్ప స్వామి ఫంక్షన్ హాల్‌లో సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రవి అధ్యక్షతన సంచారజాతులు–విముక్తి, అర్ధసంచార జాతుల సామాజిక సమ్మేళన సభ నిర్వహించారు. సంచారజాతుల సంఘం జాతీయ కన్వీనర్ తిరిపిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు మాట్లాడుతూ సంచార జాతుల సామాజిక భద్రతకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో చట్టం తేవాలని, ఎంబీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, కులస్తులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు, సంచారజాతుల సంఘం నాయకులు కుళ్లాయప్ప, జోగివెంకటేష్, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

పామిడి: పామిడి సమీపంలోని పెన్నానది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎన్.శ్రీధర్‌రామూర్తి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పామిడి మండలానికి సంబంధించి అధికారికంగా ఎటువంటి ఇసుకరీచ్‌లు లేవన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే మొదటిసారిగా ట్రాక్టర్‌కు అయితే రూ.10 వేలు, లారీ (10 టైర్స్ లోపు) అయితే రూ.25వేలు, పైన అయితే రూ.50 వేలు ఫైన్ చెల్లించాలన్నారు. రెండోసారి ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వరుసగా రూ.20 వేలు లోపు, రూ.50 వేల లోపు, రూ.లక్ష లోపు జరిమానా విధిస్తామన్నారు. ఎద్దులబండి ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తే మొదటిసారిగా రూ.2 వేలు, రెండోసారిగా రూ.3 వేలు, మూడోసారి రూ.5వేలు ఫైన్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 9493188834, 7993754477, 9581516132, 9494836844 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

లెదర్ పార్కును త్వరలో తెరిపిస్తాం


రాచేపల్లి వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

శింగనమల: రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ పార్కును త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. శుక్రవారం మండలంలోని రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ పార్కును ఎమ్మెల్యే బండారు శ్రావణి పరిశీలించారు. లెదర్ పార్కు భవనం, యంత్రాలు తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దాలుగా లెదర్ పార్కు మూతపడిందన్నారు. గతంలో ఈ ప్రాంతంలోని వారు శిక్షణ పొందారన్నారు. అందరికి ఉపయోగపడే విలా తిరిగి లెదర్ పార్కును ప్రారంభించి, ఎస్సీ యువతకు శిక్షణ అందిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

శింగనమల: మండలంలోని నాయనపల్లి క్రాస్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ కౌలుట్లయ్య శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో, దాడి చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుల నుంచి రూ.9100లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో శుక్రవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి,ఈఓ సుబ్రమణ్యం నేతృత్వంలో హుండీలోని కానుకలను లెక్కించారు. నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఏర్పాటు చేసిన పర్మినెంట్ హుండీలను లెక్కించగా రూ.11,14,031 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. కాగా దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా భక్తులు ముడుపులు, కానుకల రూపంలో హుండీలో వేసిన కొన్ని నోట్లు తడిసిపాడయ్యాయి. ఆరు బయట నారాయణస్వామి కట్టపై ఏర్పాటు చేసిన హుండీల్లోకి వర్షపు నీరు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ఈదుస్థితి నెలకొంది. ఈ విషయమై ఈఓ వద్ద ప్రస్తావించగా కొంత నగదు తడిసిన మాట వాస్తవమేనని.. భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మనదేశ సంస్కృతి ఎంతో గొప్పది


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయాదిత్య

బుక్కరాయసముద్రం: ప్రపంచంలో భారత దేశ సంస్కృతి ఎంతో గొప్పదని ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ ప్రచారక కార్యదర్శి విజయాదిత్య అన్నారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో దేశభక్తిలో యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ సౌభాగ్యానికి కృషి చేయాలన్నారు. యువతీ యువకులు స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత మంచి మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, డాక్టర్ లక్ష్మీనారాయణ, అరవింద్, వెంకట సునీత, డాక్టర్ గురుసిద్ధప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

17 నుంచి క్రీడా పోటీలు

యాడికి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 17 నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కాశెప్ప తెలిపారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగన్న, మండల కోఆర్డినేటర్ ఓబుళమ్మ , పీడీ, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 17వ తేదీ బాలురు, 18న బాలికలకు క్రీడా పోటీలుంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే పాఠశాలల జట్లు విద్యార్థుల స్టడీ సర్టిఫికెట్‌లో పుట్టిన తేదీ, ఆధార్ కార్డు జిరాక్స్‌తో 17న ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

'వేధింపుల కారణంగానే నాగమణి ఆత్మహత్య'

గుంతకల్లు: అధికారుల వేధింపుల కారణంగానే రైల్వే ఉద్యోగి నాగమణి ఆత్మహత్యకు పాల్పడిందని, అందుకు కారుకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్‌ఎం విజయ్‌కుమార్‌ను సంఘం నాయకులు కలసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ డీఈఈ సురేంద్రరెడ్డి, పీఏ ప్రేమ్‌కుమార్ వేధింపుల భరించలేక గత నెల ఆగస్టు 2న జూనియర్ ఇంజినీర్ నాగమణి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న రోజు న్యాయం, సాయం చేస్తామని నమ్మబలికించి.. నేడు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై నాగమణి తల్లి సామ్రాజ్యలక్ష్మి అనంతపురంలోని నాలుగో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా ఎస్పీని కలిసిందన్నారు. అదేవిధంగా కళ్యాణదుర్గంలో విద్యుత్ శాఖలో పని చేసే లైన్‌మెన్ కురబ రామాంజనేయులు ఇదే తరహా వేధింపులకు గురై బలయ్యారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరు ఉద్యోగులపై అధికారులు వేధింపులు ఆపాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు.కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఓబులేసు, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మాల పరిరక్షణ వేదిక నాయకుడు దాసరి రామాంజనేయులు, అంబేద్కర్ యువసేన నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

బుక్కరాయసముద్రం/గుత్తి/గుంతకల్లు రూరల్/పామిడి: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం తల్లీబిడ్డ సంరక్షణ, పౌష్టికాహారం ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ ఉమా శంకరమ్మ, సూపర్ వైజర్ నాగవేణి హెల్త్ ఎడుకేటర్ పర్వీన్, సిబ్బంది తదితరుల పాల్గొన్నారు. అలాగే గుత్తిలోని ఎస్సీ కాలనీలో, పామిడి పట్టణంలోని 2, 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గుంతకల్లు మండలంలోని వైటీ చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం, రక్తహీనతపై అవగాహన కల్పించారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం


వెంకట సుబ్బమ్మకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: తాడిపత్రిలో హోంగార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డి.వెంకటసుబ్బమ్మకు 4,39,200 ఆర్థిక సాయాన్ని ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం అందజేశారు. జిల్లా హోంగార్డులు తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందజేయడాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణ మూర్తి, ఆర్‌ఐ మధు పాల్గొన్నారు.

సీఐ సేవలు అమోఘం

పామిడి: పామిడి సీఐగా ఎం.రాజశేఖర్‌రెడ్డి సేవలు అమోఘమని వక్తలు అన్నారు. శుక్రవారం స్థానిక ఎద్దులపల్లిరోడ్డులోని రహమత్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సీఐ బదిలీ వీడ్కోలు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. ఆయన విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రజలు మన్ననలు పొందారన్నారు. అనంతరం సీఐని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, బొల్లు వెంకట్రామిరెడ్డి, అనుంపల్లి సూరి, బొట్టు రామచంద్ర, ఈశ్వర్‌రెడ్డి, అబ్దుల్ రజాక్, కే మహబూబ్‌భాష, శివ, మూలి నాగేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నాగేష్‌యాదవ్, సూర్యనారాయణరెడ్డి, సుధాకర్, సురేంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు పాటుపడతాం


గుంతకల్లులో ఏచూరి చిత్రపటం వద్ద జోహార్లర్పిస్తున్న సీపీఎం నాయకులు


తాడిపత్రిలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్/తాడిపత్రి రూరల్/శింగనమల/పెద్దవడుగూరు/పామిడి/తాడిపత్రి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు చేసిన పోరాట యోధుడు కమ్యూనిస్ట్ అగ్రనేత సీతారాం ఏచూరి ఆశయ సాధనకు పాటుపడతామని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే.నాయుడు అన్నారు. శుక్రవారం గుంతకల్లులోని పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏచూరి ఆకస్మిక మృతి కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుతి, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణ సమీపంలోని రంగప్ప కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏచూరి చిత్రాపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి రంగయ్య, నాయకులు కృష్ణమాచారి, ఎర్రప్ప, మద్దిలేటి, లోకేష్, రామలక్ష్మమ్మ, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు. శింగనమలలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఎం కార్యవర్గ సభ్యుడు భాస్కర్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం నాయకులు ధనుంజయ, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులో సీపీఎం నాయకులు దస్తగిరి, ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పామిడిలోని సీపీఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి సీపీఎంనాయకులు పీ అనిమిరెడ్డి, మల్లేష్, ముత్యాలు నివాళులర్పించారు. అలాగే తాడిపత్రిలోని నంద్యాల రోడ్డులో ఉన్న సీపీఎం కార్యాయలంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు చల్లా సుబ్బరాయుడు


చల్లా సుబ్బరాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: మాజీ మంత్రి చల్లా సుబ్బరాయుడు ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే జేసి అస్మిత్‌రెడ్డి కొనియాడారు. మాజీ మంత్రి వర్ధంతిని స్థానిక యల్లనూరు రోడ్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తదితరులు చల్లా సుబ్బరాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

తాడిపత్రి టౌన్/అర్బన్: తాడిపత్రి పట్టణంలో సీపీఐ నాయకులు వరద బాధితుల కోసం శుక్రవారం విరాళాలు సేకరించారు. సీపీఐ తాలూకా కార్యదర్శి రంగయ్య , మండల కార్యదర్శి నాగరంగయ్య, నాయకులు నారాయణరెడ్డి, చిన్న కుళ్లాయప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.